

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 206 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం, 26, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్







# తెలంగాణ గ్రామ పంచాయతీల్లో గందరగోళం !

సర్పంచుల ఇష్టరాజ్య పొగడలకు బలౌతున్న గ్రామాలు.

ప్రతి గ్రామంలో పేరుకుపోతున్న సమస్యలు.

సెటిల్మెంట్ల దందాలకు మరుగుతున్న సర్పంచులు.

ప్రజాసేవను పక్కనపెట్టి పైసా సంపాదనకు ఉరకలేస్తున్నారు.

చాలా చోట్ల ప్రభుత్వ నిధులను దుర్వినియోగపరుస్తున్నారని నిందలు వస్తున్నాయి.

భూ సెటిల్మెంట్లలో కేటుగాళ్ల కన్నా ఎక్కువ చెలాయిస్తున్నారు.

ఏ పోలీస్ స్టేషన్లో చూసిన సర్పంచ్ల పైరవీలే నడుస్తున్నాయి.

గ్రామ పాలనలను గాలికి వదిలేస్తున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

గ్రామాల్లో చట్ట విరుద్ధమైన పంచాయితీలు పెరిగిపోతున్నాయి.

పైసా సంపాదన కోసం ఎంతటికైనా దిగజారుతున్నారు.

ప్రజలకు మేలు చేసే సర్పంచులను పెద్ద ఎత్తున గౌరవించుకుంటున్న ప్రజలు.

డాక్టర్ బరిగెల శివ





డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్ :**

ప్రజలను పట్టించుకోవాల్సిన సర్పంచులు పైస సంపాదనకు మరుగుతున్నారని డాక్టర్ బరిగెల శివ గుర్తుచేశారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామానికి అంగరక్షకునిగా ప్రజల తరఫున ప్రజల సమస్యల తరఫున నిలబడుతూ ప్రజా సమస్యల పరిష్కారం మార్గాలను కనపరుస్తూ ప్రజలకు మేలు చేయాల్సిన సర్పంచులు పొద్దున లేచినది మొదలుకొని రాత్రి వరకు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ భూ పంచాయతీలు ఫైనాన్స్ పంచాయతీలు కుటుంబ కలహాల పంచాయతీలు ఆర్థిక లావాదేవుల పంచాయతీలు గ్రామంలో జరుగుతున్న గొడవలకు సంబంధించిన పంచాయతీలు చేస్తూ పోలీసు అధికారులచే గ్రామస్థాయి ప్రజలపై పరోక్ష దాడులకు పాల్పడుతూ ప్రజావిశ్వాసాన్ని పూర్తిగా కోల్పోతున్నారని హెచ్చరించారు. ఏ గ్రామంలో చూసిన ప్రజలకు సేవ చేయాల్సిన సర్పంచులు గ్రామంలో పలుకుబడిని పెంచుకోవడం కోసం ప్రతి సమస్య వాళ్ల వద్దకే వచ్చే విధంగా గ్రామాల్లో కాస్త కూస్తో లీగల్ పరిజ్ఞానం కలిగిన సన్నిహిత న్యాయవాదులను వాళ్ళ సహకారాలను ఉపయోగించుకుంటూ ప్రజలను నానా రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని పెద్ద ఎత్తున

- మిగతా 2లో..

## గతాన్ని మరచి పోండి.. అలాంటి పొరపాట్లు జరగవు

ఇకముందు మిమ్ములను బాగా చూసుకుంటా

వచ్చేది కెసిఆర్ ప్రభుత్వమే అంటూ..కార్యకర్తలకు కెటిఆర్ భరోసా

6



## ఎస్సీ రిజర్వేషన్లు ఇందిరమ్మ పుణ్యం

అభివృద్దిని ఓర్వేలకపోతున్న బావాబామ్మర్దులు

ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను ప్రారంభించిన టీపీసీసీ చీఫ్

2



## భట్టితో మేఘాలయ సిఎం భేటీ

**హైదరాబాద్,జూన్25(జై భీమ్ న్యూస్) :**

అధికారిక పర్యటనలో భాగంగా హైదరాబాద్ వచ్చిన మేఘాలయా ముఖ్యమంత్రి సీ.కే. సంగ్మా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ కు వచ్చిన మేఘాలయా ముఖ్యమంత్రి సంగ్మాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పథకాలను వివరించారు. అలాగే సంగ్మా బుధవారం సిఎం రేవంత్తోనూ భేటీ అయ్యారు.





## జల వివాదాలను పరిష్కరించుకుందాం

పంచాయితీలు కాదు...పరిష్కారాలు ముఖ్యం

తుంగభద్ర గేట్ల ప్రారంభం చరిత్రలో నిలవాలి

మూడు రాష్ట్రాల పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలి

కేంద్రమంత్రి పాటిల్ దీనిని అవకాశంగా తీసుకోవాలి

తుంగభద్రలో 15 టిఎంసిలకు 5 టిఎంసిలే అందుతున్నాయి

మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్రెడ్డి

2

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# జల వివాదాలను పరిష్కరించుకుందాం

**పంచాయితీలు కాదు...పరిష్కారాలు ముఖ్యం**
**తుంగభద్ర గేట్ల ప్రారంభం చరిత్రలో నిలవాలి**
**మూడు రాష్ట్రాల పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలి**
**కేంద్రమంత్రి పాటిల్ దీనిని అవకాశంగా తీసుకోవాలి**
**తుంగభద్రలో 15 టిఎంసిలకు 5 టిఎంసిలే అందుతున్నాయి**
**మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

**బళ్లారి,జూన్25(జై భీమ్ న్యూస్):**

తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.'తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని అన్నారు. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పిల్ వే గేట్లు ప్రారంభించాక, కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు. తమకు పంచాయితీలు వద్దని.. పరిష్కారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించక పోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పుకొచ్చారు. ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకం తమకు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఎస్టీ రిజర్వేషన్లు ఇందిరమ్మ పుణ్యం

**అభివృద్ధిని ఓర్వేలకపోతున్న బావాబామ్మర్దులు**
**ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను ప్రారంభించిన టీపీసీసీ చీఫ్**

**హైదరాబాద్,జూన్25(జై భీమ్ న్యూస్) :**

ఇందిరాగాంధీ.. ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వకపోయి ఉంటే నేడు లంబాడీలు, ఎరుకల, యానాదిలు ఈ స్థాయిలో ఉండేవాళ్లు కాదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. లంబాడీల బాగు కోసం పనిచేసే ప్రభుత్వం తమది అని స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ గుడిసెలు లేని గ్రామాలు కావాలని అనుకున్నారని.. ఆ దిశగానే తాము ముందుకు వెళ్తున్నామని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ గిరిజన నేతలు చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు శకం గతమని.. అధికారం పోయిందన్న అక్కసుతో వారిద్దరూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి.. బావాబామ్మర్దులకు నచ్చడం లేదని మహేష్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు తగ్గకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. 1 లక్ష 78 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చామని తెలిపారు. ఫ్యూచర్ సిటీని మొదలు పెట్టి 5 లక్షల 78 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెప్పారు. బస్సు యాత్ర ముగింపు కార్యక్రమానికి ప్రియాంక గాంధీని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ లంబాడ ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.

# రాష్ట్రపతితో హోంమంత్రి అమిత్ షా భేటీ

**మంత్రివర్గ విస్తరణపై జోరందుకున్న ఊహాగానాలు**

**న్యూఢిల్లీ,జూన్25(జై భీమ్ న్యూస్) :**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా తాజాగా భేటీ అయ్యారు. రెండు రోజుల క్రితమే ప్రధాని మోదీ రాష్ట్రపతిని కలిశారు. ఈ నేపథ్యంలో నేడు అమిత్ షా కూడా రాష్ట్రపతితో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. త్వరలోనే కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ ఖాయమన్న టాక్ ఢిల్లీ వర్గాల్లో వినిపిస్తోంది. జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టుల రాజ్యసభ పదవీకాలం ముగియడంతో కేంద్ర కేబినెట్‌లో ఖాళీలు ఏర్పడ్డాయి. మరోవైపు, కేంద్ర మంత్రులుగా ఉన్న కొందరు సీనియర్ నేతలకు రాష్ట్రాల పార్టీ అధ్యక్ష బాధ్యతలను బీజేపీ అప్పగించింది. ఈ నేపథ్యంలో వీరు త్వరలోనే మంత్రి పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక రాబోయే పంజాబ్, ఉత్తరప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, సామాజిక సమీకరణల ఆధారంగా కొత్త వారికి కేబినెట్‌లో చోటుదక్కే అవకాశం ఉంది. శివసేన (షిండే వర్గం), జేడీయూ వంటి కూటమి పక్షాల నుంచి అదనపు మంత్రి పదవుల కోసం కేంద్రంపై ఒత్తిడి పెరుగుతోందని సమాచారం. ఈ నేపథ్యంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల లోపే కేబినెట్ విస్తరణ ప్రక్రియను పూర్తి చేసేలా మోదీ–షా ద్వయం కసరత్తు చేస్తునట్టు సమాచారం. జులై 20 వ తేదీ తరువాత పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరిగే అవకాశం ఉంది.

# గ్రామపంచాయతీల్లో గందరగోళం

మొదటి పేజీ తరువాయి

విమర్శలు వస్తున్నాయి అన్నారు.ప్రతి గ్రామపంచాయతీలో గ్రామసభలు జరుగుతున్న సందర్భంలో ఆదాయ రెక్కలపై స్పష్టత లేని ఖర్చులు చూపిస్తూ ప్రభుత్వ డబ్బులను పక్కదారి మళ్లిస్తున్నారని వాటి ద్వారా సర్పంచ్ లంతా కావలసిన లావాదేవీలతో కూడిన ఆదాయాలను సంపాదించుకుంటున్నారని అన్నారు.ప్రతి గ్రామంలో గ్రామస్థాయి వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సర్పంచులు పట్టణాల వైపు తిరుగుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారాలను కాంట్రాక్టు వ్యాపారాలను చేస్తున్నారని గుర్తు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ప్రభుత్వం గ్రామ పరిపాలన అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న సందర్భంలో జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ప్రతి గ్రామ అభివృద్ధి కోసం విడుదల చేస్తున్న నిధులను లెక్కల్లో చూపిస్తూ ఖర్చులు చేస్తున్న నిధుల ఆధారాలను జమ చేయలేకపోవడం నిధుల దుర్వినియోగం జరుగుతున్న తీరు పట్ల అర్థం కాకుండా పోతుందన్నారు.సామాన్యులను వేధిస్తూ వ్యాపారాలు చేస్తున్నారని అదే గ్రామంలో గ్రామస్థాయిలో జరుగుతున్న ప్రతి పనిలో అక్రమంగా వాటాలు తీసుకుంటూ డబ్బు సంపాదన సంపాదిస్తున్నారని పెద్ద ఎత్తున నిందలు వస్తున్నాయన్నారు.ఏ గ్రామంలో చూసిన బెల్టు షాపులు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఇసుక వ్యాపారాలు మొరం వ్యాపారాలు క్రషర్ వ్యాపారాలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయని ఒక వైపు పోలీస్ అధికారులు ప్రతి గ్రామాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షిస్తూ ఇలా అక్రమంగా సాగుతున్న వ్యాపారాలను నియంత్రించడం కోసం ప్రయత్నం చేస్తుంటే గ్రామస్థాయిలో సర్పంచ్ లకు సహకారంగా ఉంటున్న వ్యక్తులు సదరు వ్యాపారాలను కొనసాగించుకుంటామంటూ లెక్కలేని పైరవీలు చేస్తూ రాజకీయంగా ఒత్తిళ్లు తీసుకొస్తూ కేవలం పోలీస్ శాఖనే కాకుండా ఇతర శాఖలను కూడా వాళ్ళ అక్రమ దందాకు అడ్డు రాకుండా ముందస్తుగానే మిట్ట మధ్యాహ్నం వ్యాపారాలు చేస్తుండడం అన్ని శాఖలు గుట్టుచప్పుడు కాకుండా వ్యవహరిస్తుండడం గ్రామస్థాయి అభివృద్ధి వ్యవస్థ పూర్తిస్థాయిలో కుంటుపడిపోతుందని విమర్శించారు.రియల్ ఎస్టేట్ వ్యాపారాలలో ఎక్కువగా తల దూరుస్తూ భూపంచాయితీలు చేస్తున్నారని ఒకరి భూమిని మరొకరికి కట్టబెట్టే క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవలు పెడుతున్నారని గొడవలను ఆసరా చేసుకుని ప్రతి గ్రామంలో డిపాజిట్ల పేరుమీద డబ్బులు దండుకుంటూ చట్టాలను న్యాయస్థానాలను చేతిలోకి తీసుకొని బహిరంగంగా పంచాయతీలు చేస్తూ ప్రజల మధ్య వైరుధ్యాలను పెంచుతున్నారని హెచ్చరించారు.

**తెల్లసొక్క రాజకీయాలతో తెగసంబర పడుతున్నారు.**

గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తెల్లచొక్కాలను ధరించి ప్రజలకు విస్తృతమైన హామీలిచ్చి ఎన్నికల్లో గెలుపొందాక గ్రామాల్లో ఉంటున్న ఓట్ల పట్ల గెలిచిన సర్పంచులకు గాని ఓడిపోయిన అభ్యర్థులకు గాని ఓట్ల సంఖ్య పై ఓటర్ల జాబితా పై నిర్దిష్టమైన అవగాహన ఉంటుందని అదే క్రమంలో ఎవరెవరు గెలిచినటువంటి అభ్యర్థులకు ఓట్లు వేశారు ఎవరెవరు ఓట్లు వేయలేదు అనేది కూడా ఎక్కువ శాతం తెలిసిపోతుండగా గెలిచిన అభ్యర్థి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను ఒకరకంగా ఓట్లు వేయని ప్రజలను మరో రకంగా చూస్తూ కేవలం ఓట్లు వేసిన ప్రజల అభివృద్ధి కొరకు పాటుపడుతున్నట్లు ఓట్లు వేయని ప్రజలను అభివృద్ధికి దూరం చేస్తున్నట్లు ప్రతి గ్రామంలో పేరుకుపోతున్న సమస్యలు స్పష్టంగా తెలుపుతున్నాయన్నారు. అభివృద్ధి చాటున జరుగుతున్న రాజకీయ కక్ష సాధింపుల వ్యత్యాసం ప్రజలకు పూర్తిగా అర్థమవుతున్నప్పటికిని గెలుపొందిన సర్పంచులకు గాని పార్టీల నాయకులకు గాని ఏ విధమైన సంబంధం లేనట్లుగా గ్రామాల్లో తిరుగుతున్నారని స్పష్టం చేశారు.తెల్లారినది మొదలుకొని తెల్లచొక్క ధరించుకొని ఎమ్మార్వో కార్యాలయాల్లో పోలీస్ స్టేషన్లలో ప్రభుత్వ కార్యాలయాల్లో తిరుగుతూ పైరవిలను హోరెత్తిస్తున్నారని అన్నారు.గ్రామాలను గాలికి వదిలేస్తూ పట్టణాలను పట్టుకొని వ్యాపారాలు చేసుకుంటూ సర్పంచ్ అనే పదవిని ముందు పెట్టుకొని ప్రజాప్రతినిధుల అండతో పలు రకాల సెటిల్మెంటులో పాల్గొంటూ ప్రజలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.ప్రజా సమస్యల పట్ల తలదూర్చినట్లయితే నిజాయితీ వైపు నిలబడుతూ అన్యాయాన్ని తప్పని రుజువు చేస్తూ గ్రామస్థాయిలోనే సమస్యల పరిష్కారాలకు మార్గాలను వేయాల్సిన సర్పంచులు సమస్యలు వాళ్లే సృష్టిస్తూ పంచాయతీలు వాళ్లే పెట్టిస్తూ డిపాజిట్లు రూపంలో డబ్బులు దగ్గర పెట్టుకుంటూ చట్ట విరుద్ధమైన పంచాయతీలు చేస్తూ కాలం గడుపుతున్నారని మొత్తం మీదుగా సర్పంచ్ ఎన్నికలలో ఖర్చుపెట్టిన డబ్బుతో పాటు పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించుకోవడానికి ఐదు సంవత్సరాల సర్పంచ్ పదవిని ఆసరాగా పెట్టుకుంటున్నారని గుర్తు చేశారు.అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయాల్సిన సర్పంచులు కులాలవారీగా విడగొట్టి అనుకూల వర్గాలకు న్యాయం చేస్తూ ఇతర కులాలను అవమాన పరుస్తూ హీనంగా చూస్తున్నారని అన్నారు.కొత్త సర్పంచులు కొలువుతీరిన సమయం నుండి ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులతోపాటు గంజాయి వ్యాపారాలు భూకబ్జాలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయని తెలిపారు. గ్రామస్థాయిలో ఉన్న భూములకు రేట్లు పెరగడంతో గ్రామం పరిధిలోని లేఅవుట్లు చేసుకుంటూ భూదందాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు.సామాన్యుల భూమి మీదకు అనుచరులను పంపిస్తూ తెల్లచొక్కా రాజకీయాలను బలపరుచుకోవడం కోసం దాదాగిరికి పాల్పడుతున్నారని వాటన్నిటిని చట్ట పరిధిలో పోలీస్ అధికారులు తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతిరోజు పోలీస్ స్టేషన్లో చుట్టూ తిరుగుతూ దళారీ పైరవీలతో పాటు పంచాయతీలు చేస్తూ భూకబ్జాదారుల కోసం పైరవీలు చేస్తూ వాళ్ళని కాపాడుతూ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న సర్పంచ్లను క్షేత్రస్థాయిలో పసిగట్టాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజా సమస్యలను పక్కనపెట్టి వ్యాపారాలు చేస్తున్న సర్పంచ్లను దగ్గరగా గమనించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి గ్రామంలో ఉంటున్నటువంటి ప్రభుత్వ పాఠశాలను దగ్గరుండి అభివృద్ధి చేయాల్సిన బాధ్యత గ్రామ సర్పంచులదేనంటూ గుర్తు చేశారు.మౌలిక వసతులు లేని ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనివ్వాల్సిన బాధ్యత గ్రామ సర్పంచులదేనని గ్రామాల్లో సేకరిస్తున్న పన్నులను మొట్టమొదటగా ప్రభుత్వ పాఠశాలలకు పబ్లిక్ హెల్త్ సెంటర్లకు కేటాయిస్తూ అక్కడి నుండే ప్రజాభివృద్ధిని కొనసాగించాలని గ్రామస్థాయి అభివృద్ధి బలోపేతం కావడానికి ప్రధాన స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు పబ్లిక్ హెల్త్ సెంటర్లు పునాదులు వేయగలవన్న సంగతిని ప్రతి సర్పంచ్ గుర్తించాలన్నారు.పేద బిడ్డల చదువు కోసం పేద ప్రజల వైద్యం కోసం పాటుపడుతున్న సర్పంచులు గ్రామస్థాయిలో చరిత్రలో నిలిచిపోగలరని గుర్తు చేశారు. అలాకాకుండా ఒంటెద్దు పొగడలతో తెల్లచొక్కా బలుపుతో ప్రజాసేవను విస్మరిస్తే గ్రామస్థాయి ప్రజలందరూ సర్పంచుల పరిపాలనను పూర్తిస్తాయిలో తిరస్కరిస్తారన్న సంగతిని గుర్తుంచుకోవాలన్నారు.




**ఆదాయ లెక్కలను పసిగట్టండి.**

సర్పంచులుగా గెలవక ముందుకు ఉన్న ఆస్తులు సర్పంచులుగా గెలిచిన తర్వాత సంపాదిస్తున్న ఆస్తుల వివరాల పట్ల జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఉన్నత అధికారులు ఎప్పటికప్పుడు ఆరాధియాల్సిన అవసరం ఉందన్నారు.సర్పంచులందరూ నిజాయితీగా కష్టపడి వ్యాపారాలు చేసుకొని సంపాదించుకుంటే ఎలాంటి అభ్యంతరాలు లేవు గాని ఒక వైపు గ్రామ స్థాయి నిధులను దుర్వినియోగపరుచుకుంటూ మరోవైపు ప్రజలను బెదిరింపులకు పాల్పడుతూ వ్యాపారాలు చేసి, దళారీ పంచాయతీలు చేసి, భూకబ్జాలు చేసి సంపాదిస్తున్న ఆస్తులన్నీ సర్పంచ్ పదవిని అడ్డం పెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడి సంపాదించిన ఆస్తులుగానే పరిగణించాల్సి ఉంటుందని గుర్తించబడే విధంగా ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రతి సర్పంచ్ కి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.సంవత్సర ఆదాయ లెక్కలను,ఆరు నెలల కాలపు ఆదాయ లెక్కలను, ఆడిట్లు చేయాల్సిన సందర్భంలో నిధులు దుర్వినియోగం జరుగుతున్నట్లుగా వెలుగులోనికి వస్తున్నప్పటికీ సర్పంచులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వము ప్రభుత్వాధికారులు శ్రద్ధ వహించలేకపోతున్నారని గ్రామస్థాయి ప్రజలు గుర్తు చేస్తున్నారన్నారు.గ్రామస్థాయి అభివృద్ధి కోసం కేటాయిస్తున్న గ్రామ ప్రజల నుండి వసూలు చేస్తున్న పన్నులను ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామ సర్పంచ్ కార్యాలయ నోటీసు బోర్డులలో పొందుపరిచి ప్రజలందరికీ నిజాయితీతో కూడిన పరిపాలనను అందిస్తున్నట్లుగా చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.గ్రామ సభలు నిర్వహిస్తున్న సందర్భంలో వార్డు మెంబర్లు మెజార్టీ సభ్యులు సర్పంచులకు త లొగ్గుతూ వాళ్ళు చెప్పిన విధంగా నిధులు ఖర్చులపై రికార్డులలో సంతకాలు చేస్తున్న సందర్భంలో అభివృద్ధి కోసం కేటాయిస్తున్న సొమ్ములో ఎంత శాతం ప్రజలకు ఖర్చు చేస్తున్నారో ఎంత శాతం పక్కనేసుకుంటున్నారో అర్థం కాకుండా పోతుందని.దానివల్ల గ్రామస్థాయి ఆర్థిక వ్యవస్థ చిన్న బిన్నమైపోతుందని అన్నారు.అక్రమంగా సంపాదించుకోవాలనే ఆలోచన లేకుండా ప్రజల మేలు కొరకు ప్రజల అభివృద్ధి కొరకు గ్రామాల పరిరక్షణ కొరకు గ్రామాల అభివృద్ధి కొరకు అన్ని విధాలుగా పనిచేసే సర్పంచులు నిజాయితీ నిబద్ధతను పాటిస్తున్నారని అలాంటి వాళ్ళ ఆలోచనలను గౌరవించుకోవాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు.సంపాదన కన్నా ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన ఉన్న సర్పంచ్లందరూ ఉన్నత స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంటారని అభినందించారు.గ్రామస్థాయి అంటేనే సామాన్య ప్రజలు జీవిస్తారని అలాంటి ప్రజలను ఎలాంటి స్థితిలోనైనా నయవంచనకు గురి చేయడానికి ప్రయత్నం చేయకూడదని అవకాశం ఉన్న ప్రతి చోట అభివృద్ధిని కొనసాగిస్తూ అవకాశాలు లేని చోట కూడా అవకాశం సందర్భాలను కల్పించుకుంటూ ప్రతి గ్రామాన్ని పచ్చదనంతో నిండిన అభివృద్ధిని చూపిస్తూ రాష్ట్రమంతా గ్రామస్థాయి పాలనతో అభివృద్ధి మాయం జరుగుతుందని నిరూపించుకోవాల్సిన అవసరం ప్రతి సర్పంచ్ పై ఉందన్నారు.ఏ గ్రామంలోనైతే భూదందాలకు పాల్పడుతున్న సర్పంచులు ఉంటున్నారో వాళ్ళందరిపై ప్రభుత్వ ఉన్నతాధికారులు నిఘా వేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు.సర్పంచ్ పదవులను అడ్డం పెట్టుకొని పదే పదే భూదందాలకు పాల్పడుతున్న సర్పంచ్లను పదవుల్లోకి వెళ్లి తొలగించే చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం

**ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి పనులు**
**యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి**
**అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం**

**హైదరాబాద్,జూన్25(జై భీమ్ న్యూస్) :**

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నెల 27వ తేదీన శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, భద్రాచలం ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. భద్రాచలం ఆలయ వైభవం, ఆధ్యాత్మికతకు ఎటువంటి భంగం కలగకుండా, సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా రాతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంకల్పించారని ఈ మేరకు ఈ నెల 27వ తేదీన ఆలయ పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆలయ పునరుద్ధరణ పనులకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు 351 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వచ్చే శ్రీరామ నవమి నాటికి నిర్దేశించిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి ముందస్తుగానే పనుల విభజన చేసుకొని సమతరంగా అన్ని పనులు చేపట్టాలని సూచించారు.



# వికసిత భారత్-2047 సాధనలో కామర్స్, మేనేజ్‌మెంట్ విద్య కీలకం






### కేయూ వీసీ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి

**కె యు క్యాంపస్, జూన్ 25 (జై భీమ్ న్యూస్)**

"డేటా నిర్ణయాలకు దారితీస్తుంది.. కానీ విలువలే దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయి. వికసిత భారత్--2047 సాధనలో కామర్స్, మేనేజ్‌మెంట్ విద్య కీలక శక్తిగా నిలవనుంది" అని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో గురువారం నిర్వహించిన తెలంగాణ కామర్స్ అసోసియేషన్ 7వ వార్షిక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వికసిత భారత్--2047 లక్ష్యం కేవలం ఆర్థికాభివృద్ధికే పరిమితం కాదని, సాంకేతిక పురోగతి, సమగ్ర వృద్ధి, ఉపాధి కల్పన, నైతిక విలువలు, యువత సాధికారతకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. ప్రపంచ అగ్ర ఆర్థిక వ్యవస్థలలో భారత్ స్థానం సంపాదించే దిశగా యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు ఆధునిక యుగంలో విజయానికి ప్రధాన ప్రమాణంగా మారిందని, విద్యార్థులు ఏఐ సాధనాలు, సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి వాటిని సృజనాత్మకంగా వినియోగించే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అధ్యాపకులు కూడా ఏ ఐ ఆధారిత బోధనా విధానాలపై నిరంతర శిక్షణ పొందాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టా రెడ్డి ఆన్‌లైన్ ద్వారా పాల్గొని మాట్లాడుతూ కామర్స్, మేనేజ్‌మెంట్ విద్య విస్తృత ఉపాధి అవకాశాలకు మార్గం సుగమం చేస్తోందన్నారు. భారత్‌తో పాటు తెలంగాణ కూడా "రైజింగ్ తెలంగాణ" దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. సదస్సు సెక్రటరీ ఆచార్య పి. వరలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 100 మందికి పైగా జీవిత సభ్యులు పాల్గొంటున్న ఈ సదస్సులో నాలుగు సాంకేతిక సమావేశాలు, ఒక ప్లీనరీ ఉపన్యాసం, ఒక మెమోరియల్ లెక్చర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆచార్య డి. చెన్నప్ప మాట్లాడుతూ 2017లో స్థాపితమైన అసోసియేషన్‌కు ప్రస్తుతం 1,177 మంది జీవిత సభ్యులు ఉన్నారని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని, ఉచిత శిక్షణ ద్వారా 100 మందికి పైగా విద్యార్థులు ఉన్నత విద్యలో ప్రవేశాలు పొందినట్లు వివరించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ బండి మురళీ మోహన్ కృష్ణ మాట్లాడుతూ ఏ ఐ ప్రభావంతో బ్యాంకింగ్ రంగంలో డేటా ఆధారిత నిర్ణయాలు, వినియోగదారుల ప్రవర్తన విశ్లేషణ కీలక అంశాలుగా మారాయని పేర్కొన్నారు. హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్ ఆచార్య ఎస్. శ్రీనివాసమూర్తి కామర్స్ విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉద్యోగయోగ్యత కలిగిన మానవ వనరులుగా ఎదుగుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా 150 పరిశోధనా పత్రాల సారాంశాల సంకలనాన్ని విడుదల చేయడంతో పాటు తెలంగాణ కామర్స్ అసోసియేషన్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆచార్య ఎస్. నరసింహ చారి, ఆచార్య పి. అమరావేణి, ఆచార్య నరసింహమూర్తి, ఆచార్య రాజిరెడ్డి, ఆచార్య సక్రియా, ఆచార్య రాజేశం తదితరులు పాల్గొన్నారు. సభ ప్రారంభంలో ఆచార్య పి. కృష్ణమాచారి గేయం ఆలపించగా, అసోసియేషన్ కార్యదర్శి జాస్తి రవికుమార్ వందన సమర్పణ చేశారు.

# కమ్యూనిస్టుల ఐక్యతే లక్ష్యం







### జూన్ 29న వరంగల్‌లో ఎంసిపిఐ(యు) రాష్ట్ర సదస్సు

**వరంగల్, 25 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

కమ్యూనిస్టు ఉద్యమ బలోపేతం, పార్టీ ఏకీకరణ మరియు ప్రజా ఉద్యమాల విస్తరణ లక్ష్యంగా ఎంసిపిఐ(యు) రాష్ట్ర నిర్మాణ--ఏకీకరణ సదస్సును జూన్ 29న వరంగల్ నగరంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. వరంగల్ జిల్లా కార్యాలయం ఓంకార్ భవన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీలో గతంలో ఏర్పడిన విభేదాల కారణంగా విడివిడిగా కొనసాగుతున్న శక్తులను ఐక్యం చేసి ఒకే వేదికపైకి తీసుకురావడానికి పార్టీ కృషి చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించాలంటే వామపక్ష శక్తుల ఐక్యత అత్యవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద శక్తులు ప్రజలపై దోపిడీని మరింత విస్తరిస్తున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో సామాజిక న్యాయం, సమసమాజ స్థాపన కోసం కమ్యూనిస్టు శక్తులు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో దూరంగా ఉన్న నాయకులు, కార్యకర్తలతో చర్చలు జరిపి జాతీయ స్థాయిలో ఏకీకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర నిర్మాణ--ఏకీకరణ సదస్సు జూన్ 29న ఉదయం 10 గంటలకు వరంగల్ నగరంలోని అల్పాహారం కన్వెన్షన్ హాల్‌లో జరగనుందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జిల్లా కమిటీ సభ్యులు, ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ప్రజా ఉద్యమాలను మరింత విస్తరించడం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం వంటి అంశాలపై సదస్సులో కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ ఆశయ సాధన కోసం వివిధ కమ్యూనిస్టు పార్టీలతో ఐక్యత చర్చలు కొనసాగుతున్నాయని గాదగోని రవి తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ నాయకులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, మోర్తాల చందర్ రావు, గోనె కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్. రెడ్డి హంసారెడ్డి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, కన్నం వెంకన్న, మంద రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు వంగల రాగసుధ, నర్ర ప్రతాప్, కర్ర రాజిరెడ్డి, గడ్డం నాగార్జున, నీల రవి, మాస్ సావిత్రి, మాలోతు రాజేష్ నాయక్, నగర కార్యదర్శి మాలోత్ సాగర్, సహాయ కార్యదర్శి సుంచు జగదీశ్వర్‌తో పాటు పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## కేయూలో రూ.90 లక్షలతో నూతన విశ్రాంతి గదులు, శౌచాలయాల ప్రారంభం

**హన్మకొండ, 25 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో కాకతీయ విశ్వవిద్యాలయం నూతన విశ్రాంతి గదులు, శౌచాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. విశ్వవిద్యాలయ క్యాంపస్‌తో పాటు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నూతనంగా నిర్మించిన ఈ సౌకర్యాలను వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధి అధికారి ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర గ్రంథాలయంలో రెండు, పరిపాలన భవనంలో రెండు, డిజిటల్ గ్రంథాలయంలో ఒకటి, మహిళా వసతి గృహంలో ఒకటి చొప్పున విశ్రాంతి గదులు, శౌచాలయాలు నిర్మించి వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ పనుల కోసం సుమారు రూ.90 లక్షలు వ్యయం చేసినట్లు వెల్లడించారు. విద్యా సంస్థల్లో పరిశుభ్రత, మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఉందని వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా విద్యా వాతావరణం మరింత మెరుగుపడుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో, ప్రధాన ప్రవేశ ద్వారాల వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది కోసం అదనంగా విశ్రాంతి గదులు, శౌచాలయాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామిరెడ్డి, ఆచార్య బి. సురేష్ లాల్, ఆచార్య జి. హనుమంతు, డాక్టర్ కె. మమత, డాక్టర్ బి. రాధిక రాణి, తేజావత్ జావేర్, డాక్టర్ నల్లాని శ్రీనివాస్, బిల్డింగ్ డివిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ నిర్మాణాలు పూర్తికావడం విద్యార్థులు, ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



## మోత్కూరు గ్రామంలో అకాల వర్షానికి చేపలు మృతి

### ప్రభుత్వం నన్ను ఆదుకోవాలి



**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా దోమ మండలం మోత్కూర్ గ్రామంలో పడమటి కుంట చెరువును గ్రామ మత్స్య కార సంఘం ముదిరాజ్ పెద్దల సమక్షంలో, వేలం వేసి సంపల్లి నరేష్ అనే వ్యక్తి తీసుకున్నాడు, నరేష్ మాట్లాడుతూ.. ఈ రెండు మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు ఆ కుంట లోనికి మొత్తం విషపూరితమైన చెత్త రావడం ద్వారా చెరువులోని చేపలు మొత్తం చనిపోయాయి. దీని వల్ల నాకు దాదాపు 3 లక్షల నుండి 4 లక్షల వరకు నష్టం వాటిల్లింది. నేను 10 సంవత్సరాల నుండి ఈ చేపల వ్యాపారం చేసుకుంటూ నా జీవనం కొనసాగిస్తున్నాను. కావున దయచేసి ప్రభుత్వం నన్ను ఆదుకోవాలని కోరారు.

## కల్తీ పచ్చళ్ల తయారీ కేంద్రంపై టాస్క్ ఫోర్స్ మెరుపు దాడి

### ఒకరి అరెస్ట్ - రూ.2.25 లక్షల విలువైన కుళ్లిపోయిన ఆహార నిల్వలు స్వాధీనం

**వరంగల్ / 25,జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**



వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో అక్రమంగా పచ్చళ్ల తయారీ, నిల్వలు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్న కేంద్రంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో భారీ మొత్తంలో కుళ్లిపోయిన ముడి సరుకులు, కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేశారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాశీబుగ్గ సాయి వీధిలో ఉన్న ఓ నివాస గృహంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో పచ్చళ్ల తయారీ జరుగుతున్నట్లు గుర్తించారు. కుళ్లిపోయిన మామిడి, టమోటా, నిమ్మకాయలు, ఉసిరికాయలు తదితర ముడి సరుకులను నిల్వ ఉంచి, వాటిని చిన్న ప్యాకెట్లలో ప్యాకింగ్ చేసి స్థానిక కిరాణా దుకాణాలు మరియు ఇతర వ్యాపార కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంలో కాశీబుగ్గకు చెందిన అరికెల శ్రీనివాస్ (51)ను అదుపులోకి తీసుకున్నారు. దాడిలో 750 కిలోల టమోటాలు, 900 కిలోల మామిడికాయలు, 200 కిలోల నిమ్మకాయలు, 100 కిలోల ఉసిరికాయలు, 150 కిలోల అల్లం-వెల్లుల్లి పేస్ట్‌తో పాటు మొత్తం రూ.2.25 లక్షల విలువైన కల్తీ, కుళ్లిపోయిన ఆహార నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సరుకును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు బ్రాండ్ లేని లేదా నాణ్యతపై అనుమానాలు ఉన్న ఆహార పదార్థాలు, పచ్చళ్లను కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని టాస్క్ ఫోర్స్ అధికారులు సూచించారు. కల్తీ ఆహార పదార్థాల తయారీ లేదా విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ దాడిని టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ బండారి రాజు, ఆర్ఎస్ఐ ఓ. భాను ప్రకాష్ , టాస్క్ ఫోర్స్ సిబ్బంది నిర్వహించారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ మహేందర్

### అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

**హసన్‌పర్తి, 25 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, యువత మరియు ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మహేందర్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వ్యక్తి ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల వైపు దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, భవిష్యత్తును నాశనం చేసుకునే అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక ప్రజలతో కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు "సే నో టు డ్రగ్స్ -- సే ఎస్ టు లైఫ్" అనే సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొని ప్రజల్లో చైతన్యం కల్పించారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత హెల్ప్‌లైన్ నంబర్లకు తెలియజేయాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, హసన్‌పర్తి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

## అనారోగ్య బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి గొప్ప ఊరట

ఎంపీ డాక్టర్ కడియం కావ్య





**హన్మకొండ , 25 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) గొప్ప వరంగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడడంలో సీఎం రిలీఫ్ ఫండ్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ. 3.50 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ కడియం కావ్య స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో వైద్య ఖర్చులు భరించడం చాలా కష్టసాధ్యమవుతుందని అన్నారు. అలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయ నిధి ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందాల్సి వచ్చినప్పుడు లక్షల్లో ఖర్చు అవుతుండటంతో అనేక కుటుంబాలు అప్పుల పాలయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, అలాంటి వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని వివరించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అవసరమైన సహాయం కోసం ప్రజలు ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. కష్టకాలంలో తమకు ఆర్థిక చేయూత అందేలా చొరవ చూపిన ఎంపీ కడియం కావ్యకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ స్థాయి వసతులతో టిఐఆర్ఎస్ భవనాలు

నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ సత్య శారద

నాణ్యతలో రాజీ వద్దు.. గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**హన్మకొండ, 25 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యా వసతులు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (టిఐఆర్ఎస్) నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం వరంగల్ మండలం పైడిపల్లి గ్రామంలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్, భవన నిర్మాణంలో ఉపయోగిస్తున్న సిమెంట్ గ్రేడ్, ఇనుము నాణ్యత, ఇటుకల దృఢత్వం తదితర అంశాలపై ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో పాటు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం పనులు ఎంత శాతం పూర్తయ్యాయో, మిగిలిన పనులను ఎప్పటిలోగా పూర్తి చేయనున్నారో అడిగి తెలుసుకున్నారు. వర్షాకాల పరిస్థితుల కారణంగా నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, సిమెంట్ సెట్టింగ్‌లో జాప్యం, మట్టి పనుల ఆలస్యం వంటి అంశాలపై కూడా అధికారులతో చర్చించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్ పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలు, నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేస్తూనే నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జిల్లా విద్యాధికారి రంగయ్య నాయుడు, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి





దాస్యం వినయ్ భాస్కర్

**హన్మకొండ , 25 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ - స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ గురువారం ప్రారంభమైన సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 50వ డివిజన్ జులైవాడ 117వ పోలింగ్ బూత్‌ను ఆయన సందర్శించారు. బీఎల్వో మణికంఠా రెడ్డితో కలిసి పోలీస్ కాలనీలో ఓటర్లను కలుసుకుని ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు అనే ఓటరుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఖచ్చితమైన సమాచారంతో కూడిన ఓటరు జాబితా రూపొందుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. పారదర్శకమైన ఓటరు జాబితా తయారీలో బీఆర్ఎస్ పార్టీ పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. పార్టీ తరఫున ఇప్పటికే బూత్ లెవల్ ఏజెంట్లను (బీఎల్ఏలు) నియమించామని, వారు క్షేత్రస్థాయిలో ఓటర్లను కలిసి అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ మ్యాపింగ్ దాదాపు పూర్తయిందని, అయితే హనుమకొండ వంటి పట్టణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ కొంత క్లిష్టంగా ఉన్నప్పటికీ ఎన్నికల కమిషన్, బీఎల్వోలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. భారతదేశం ప్రజాస్వామ్యబద్ధంగా నడిచే దేశమని, ప్రజలు తమ ప్రతినిధులను ఓటు ద్వారా ఎన్నుకుంటారని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైనదని చెప్పారు. ఓటు భారతీయుల ప్రాథమిక హక్కు అని పేర్కొంటూ, ప్రతి ఓటరు తన వివరాలను సరిచూసుకుని ఓటరు జాబితాలో నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. డబుల్ ఓట్లు, మరణించిన వారి పేర్లు తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియకు కూడా బీఆర్ఎస్ పార్టీ మరియు పార్టీ నియమించిన బీఎల్ఏలు సహకరిస్తున్నారని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇప్పటికే డివిజన్ వారీగా సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ మాజీ అధ్యక్షుడు కోటేశ్వర్ రావు, 5వ డివిజన్ మాజీ అధ్యక్షుడు పున్నం చందర్, నాయకులు ఇమాముద్దీన్, మూటిక రాజు యాదవ్, మల్లారెడ్డి, ప్రసాద్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యానికి తావులేదు..





గైర్హాజరు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

డీఎంహెచ్‌వో డా. ఎస్.డి. రామ్‌కుమార్

**హన్మకొండ, 25 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

సమయపాలన పాటించకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం వహించడం సహించబోమని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎస్.డి. రామ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన పెద్దమ్మగడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)ను ఆకస్మికంగా సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను, క్షేత్రస్థాయిలో ఎక్కడెక్కడ సేవలందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఆరు రోజులుగా విధులకు గైర్హాజరైన ఓ ఉద్యోగితో పాటు, గురువారం విధులకు హాజరు కాని మరో ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులతో మాట్లాడిన ఆయన, వారు ఏ సమస్యలతో వచ్చారో, చికిత్స ఎలా అందుతున్నదో తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని, అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. రానున్న ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను కూడా పరిశీలించారు. అనంతరం పెద్దమ్మగడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో, రంగంపేట ప్రాంతాన్ని సందర్శించి అక్కడ ఏఎన్ఎం నిర్వహిస్తున్న సేవలను తనిఖీ చేశారు. రంగంపేట-3 అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి నమోదైన గర్భిణీల వివరాలను పరిశీలించారు. గర్భిణీల నమోదు శాతం వందకు వంద ఉండాలని, వారికి తప్పనిసరిగా నాలుగు సార్లు వైద్య పరీక్షలు నిర్వహించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో ముచ్చటించిన ఆయన, వారికి అందిస్తున్న విద్యా కార్యక్రమాలు, పోషకాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం నాణ్యతపై కూడా ఆరా తీశారు. అనంతరం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రం (ఎస్ఎన్‌సీయూ)ను సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. తక్కువ బరువుతో జన్మించిన శిశువులు, నెలలు నిండక ముందే పుట్టిన చిన్నారులకు అందిస్తున్న చికిత్సా సేవలను పరిశీలించి, శిశువుల తల్లులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గత రెండు నెలల్లో కేంద్రంలో అందించిన సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన డీఎంహెచ్‌వోకు, మే నెలలో 96 మంది, జూన్ నెలలో ఇప్పటివరకు 68 మంది నవజాత శిశువులకు చికిత్స అందించినట్లు వైద్యులు వివరించారు. ఫిబ్రవరి 2026 నుంచి ఎస్ఎన్‌సీయూలో చేరిన ప్రతి శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయినట్లు తెలిపారు. కేంద్రంలోని వైద్య పరికరాలు, అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచిన ఎమర్జెన్సీ ట్రేలను కూడా ఆయన పరిశీలించారు. ఈ తనిఖీల్లో జీఎంహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ మంజుల, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సుభాష్, డాక్టర్ ప్రశాంత్, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, మురళి, నర్సింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేయూ కంప్యూటర్ సైన్స్ విభాగ నూతన విభాగాధిపతిగా డా. ఎం. వేణుగోపాల్ రెడ్డి

**హన్మకొండ, 25 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగ నూతన విభాగాధిపతిగా సహాయ ఆచార్యులు డా. ఎం. వేణుగోపాల్ రెడ్డిని రెండేళ్ల కాలపరిమితికి నియమిస్తూ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం విభాగాధిపతిగా కొనసాగుతున్న డా. బి. రమ నుంచి డా. వేణుగోపాల్ రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయనకు 33 సంవత్సరాల బోధనా అనుభవంతో పాటు మూడు సంవత్సరాల పరిశోధన అనుభవం ఉంది. 2013లో కాకతీయ విశ్వవిద్యాలయంలో చేరిన డా. వేణుగోపాల్ రెడ్డి గతంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతిగా, పాఠ్య ప్రణాళిక మండలి అధ్యక్షులుగా, దివ్యాంగుల సెల్ సంచాలకులుగా, క్యాంపస్ నెట్‌వర్క్ సెంటర్ సంచాలకులుగా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. విద్యా, పరిశోధనా రంగాల్లో విశేష కృషి చేసిన ఆయన రచించిన 10కు పైగా పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. అలాగే రెండు అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధనా పత్రాలను సమర్పించారు. డా. ఎం. వేణుగోపాల్ రెడ్డి నియామకాన్ని విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు స్వాగతిస్తూ అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యా, పరిశోధనా రంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.





# డేటా నిర్ణయాలకు దారితీస్తుంది..

**విలువలే దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయి**
**వీసీ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి**

**హన్మకొండ, 25 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

డేటా నిర్ణయాలకు దారితీస్తుంది.. కానీ విలువలే దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయి. వికసిత భారత్--2047 సాధనలో కామర్స్, మేనేజ్‌మెంట్ విద్య కీలక శక్తిగా నిలవనుందిఅని ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో గురువారం నిర్వహించిన తెలంగాణ కామర్స్ అసోసియేషన్ 7వ వార్షిక సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగించారు. 'వికసిత భారత్--2047' లక్ష్యం కేవలం ఆర్థికాభివృద్ధికి మాత్రమే పరిమితం కాదని, సాంకేతిక పురోగతి, సమగ్ర వృద్ధి, ఉపాధి కల్పన, నైతిక విలువలు, యువత సాధికారతకు మార్గదర్శకమని ఆయన పేర్కొన్నారు. రానున్న దశాబ్దాల్లో ప్రపంచంలోని అగ్ర ఆర్థిక వ్యవస్థలలో భారత్ ఒకటిగా అవతరించనున్న నేపథ్యంలో యువత పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. విద్యార్థులు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాలపై పట్టు సాధించి వాటిని సృజనాత్మకంగా వినియోగించే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. నేటి అధ్యాపకులు తరగతి గదికే పరిమితం కాకుండా భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేలా, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను ఏఐ ఆధారిత నైపుణ్యాలతో తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉందన్నారు. ఏఐ వినియోగమే నేటి విజయానికి కీలక ప్రమాణంగా మారిందని, బ్యాంకింగ్, ఫైనాన్స్, విద్య, పరిశ్రమలు, సేవారంగాల్లో ఇది విప్లవాత్మక మార్పులకు దారి తీస్తోందన్నారు. వ్యాపార నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చిన ఏఐ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠ్య ప్రణాళికల్లో ఆధునిక సాంకేతికతలకు ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్న తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ కామర్స్, మేనేజ్‌మెంట్ విద్య విస్తృత ఉపాధి అవకాశాలకు మార్గం సుగమం చేస్తోందన్నారు. డిగ్రీ, పీజీ స్థాయిలో సిలబస్ సంస్కరణలు కొనసాగుతున్నాయని, భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మరింత ఉన్నత స్థానానికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సదస్సు సెక్రటరీ ఆచార్య పి. వరలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా వంద మందికి పైగా జీవిత సభ్యులు పాల్గొంటున్న ఈ సదస్సులో నాలుగు సాంకేతిక సమావేశాలు, ఒక ప్లీనరీ ఉపన్యాసం, ఒక మెమోరియల్ లెక్చర్‌తో పాటు ప్రారంభ, ముగింపు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆచార్య డి. చెన్నప్ప మాట్లాడుతూ 2017లో స్థాపితమైన అసోసియేషన్‌కు ప్రస్తుతం 1,177 మంది జీవిత సభ్యులు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 50కిపైగా అకాడమిక్ కార్యక్రమాలు, కార్యశాలలు నిర్వహించామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ బండి మురళీ మోహన్ కృష్ణ మాట్లాడుతూ ఏఐ ప్రభావంతో బ్యాంకింగ్ రంగంలో డేటా ఆధారిత నిర్ణయాలు, వినియోగదారుల ప్రవర్తన విశ్లేషణ కీలక అంశాలుగా మారాయని పేర్కొన్నారు. హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్ ఆచార్య ఎస్. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిద్ధమయ్యే మానవ వనరులుగా ఎదుగుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా 150 పరిశోధనా పత్రాల సారాంశాల సంకలనాన్ని విడుదల చేయడంతో పాటు తెలంగాణ కామర్స్ అసోసియేషన్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆచార్య ఎస్. నరసింహ చారి, ఆచార్య పి. అమరావేణి, ఆచార్య నరసింహమూర్తి, ఆచార్య రాజిరెడ్డి, ఆచార్య సక్రియా, ఆచార్య రాజేశం, జాస్తి రవికుమార్, డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ ప్రగతి, డాక్టర్ నిరంజన్, డాక్టర్ స్వామి తదితరులు పాల్గొన్నారు. సభ ప్రారంభంలో ఆచార్య పి. కృష్ణమాచారి తన గేయంతో సభికులను ఆకట్టుకున్నారు.




# కౌశల్ మహోత్సవ్-2026

**తెలంగాణ యువతకు 5,000కు పైగా ఉద్యోగ అవకాశాలు**




**వరంగల్, 25 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలను విస్తృతంగా అందించేందుకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయ శాఖ (ఎం.ఎస్.డి.ఈ) ఆధ్వర్యంలో కౌశల్ మహోత్సవ్--వరంగల్ 2026 నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ మహోత్సవం జూన్ 27న వరంగల్‌లోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) కళాశాలలో జరగనుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంఎస్‌డీఈ డైరెక్టర్ వి.ఎస్. అరవింద్, ప్రాంతీయ ఉపాధి అధికారి తౌటం రాము, కిట్స్ రిజిస్ట్రార్ కోమల్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి కల్పించడం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య సిబ్బందిని అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. అధికారుల వివరాల ప్రకారం, ఈ మహోత్సవంలో 50కు పైగా ప్రముఖ సంస్థలు పాల్గొని 5,000కు పైగా ఉద్యోగ అవకాశాలను అందించనున్నాయి. ఉద్యోగార్థులు నేరుగా సంస్థల ప్రతినిధులను కలుసుకొని ఇంటర్వ్యూలలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుంది. అలాగే అప్రెంటిస్‌షిప్, శిక్షణా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి పథకాలు, భవిష్యత్ ఉపాధి అవకాశాలపై సమగ్ర సమాచారం అందించనున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులతో పాటు నైపుణ్యం కలిగిన యువత అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. తయారీ, రిటైల్, లాజిస్టిక్స్, ఆటోమొబైల్, టెక్స్టైల్, ఐటీ–ఐటీఈఎస్, హెల్త్‌కేర్, టూరిజం, హాస్పిటాలిటీ, టెలికాం, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ తదితర రంగాలకు చెందిన సంస్థలు నియామక ప్రక్రియలో పాల్గొంటాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ వి.ఎస్. అరవింద్ మాట్లాడుతూ, నైపుణ్యం కలిగిన ప్రతి యువకుడికి అర్థవంతమైన ఉపాధి అవకాశాలు అందించాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి కౌశల్ మహోత్సవ్ వేదికగా నిలుస్తోందన్నారు. పరిశ్రమలు, శిక్షణా సంస్థలు, ఉద్యోగార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి నైపుణ్యాభివృద్ధి నుంచి ఉపాధి వరకు బలమైన అనుసంధానం కల్పిస్తున్నామని చెప్పారు. వరంగల్‌తో పాటు పరిసర జిల్లాల నుంచి వేలాది మంది యువత ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని, స్థానిక ప్రతిభకు జాతీయ స్థాయి సంస్థలతో నేరుగా మమేకమయ్యే అవకాశాన్ని ఈ మహోత్సవం కల్పిస్తుందని అధికారులు తెలిపారు. ప్రముఖ సంస్థలైన ప్రాంప్ట్ పర్సనల్ ప్రైవేట్ లిమిటెడ్, పారడైమ్ ఐటీ టెక్నాలజీ సర్వీసెస్, సీతారాం స్పిన్నర్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్‌షిప్ నెట్‌వర్క్, కాప్‌స్టన్ సర్వీసెస్, క్రీమ్ స్టోన్, జయభేరి ఆటోమోటివ్స్, బ్లింక్ కామర్స్, గెలాక్టిక్ సొల్యూషన్, ఎస్ఎంజీ ఎలక్ట్రిక్ స్కూటర్స్, వరుణ్ మోటార్స్, ఎలక్ట్రోల్యాబ్ ఇండియా తదితర సంస్థలు పాల్గొననున్నాయి. అలాగే తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) కూడా విదేశీ ఉపాధి అవకాశాల కోసం భాగస్వామిగా వ్యవహరించనుంది. కౌశల్ మహోత్సవ్ కేవలం ఉద్యోగ మేళా మాత్రమే కాకుండా, యువతలో నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి, ఉపాధి అవకాశాల విస్తరణకు దోహదపడే వేదికగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. దేశాన్ని నైపుణ్యం కలిగిన, స్వావలంబనతో కూడిన భారతంగా తీర్చిదిద్దే లక్ష్యానికి ఈ కార్యక్రమం తోడ్పడుతుందని తెలిపారు.

# ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలి

**గణన ఫారంలో కుటుంబ వివరాలు నమోదు చేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



**హన్మకొండ, 25 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ఓటరు జాబితాను మరింత ఖచ్చితమైనదిగా, పారదర్శకమైనదిగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తన కుటుంబ సభ్యుల వివరాలను ఇంటింటి గణన ఫారంలో స్వయంగా నమోదు చేసి బూత్ లెవల్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ఆదర్శంగా నిలుస్తూ ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి గణన కార్యక్రమం నిర్వహించబడుతుందని కలెక్టర్ తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించడంతో పాటు గణన ఫారాలను పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలను సక్రమంగా నమోదు చేసి బీఎల్‌వోలకు అందజేయాలని కోరారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, కుటుంబ వివరాలు తదితర సమాచారంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఉండేందుకు ఈ ప్రక్రియ ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ప్రజలు సరైన సమాచారాన్ని అందించి పూర్తి సహకారం అందించాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ విజయవంతం కావడానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడం ద్వారా ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మారుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఎన్నికల నాయబ్ తహసీల్దార్ విఠల్, ఆర్ఐ దశరథ్ రాంరెడ్డి, సూపర్వైజర్, బీఎల్‌వో విజయ తదితరులు పాల్గొన్నారు.



# పల్స్ పోలియో విజయవంతానికి కమలాపూర్ పీహెచ్‌సీలో శిక్షణా కార్యక్రమం





**కమలాపూర్, 25 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై దృష్టి సారిస్తూ కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఒకరోజు అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి సమాజాన్ని పోలియో రహితంగా తీర్చిదిద్దడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగలకుండా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో పోలియో చుక్కల పంపిణీ విధానం, వ్యాక్సిన్ భద్రపరిచే విధానాలు (కోల్డ్ చైన్ మెయింటెనెన్స్), ఇంటింటి సర్వే నిర్వహణ, లబ్ధిదారుల గుర్తింపు వంటి అంశాలపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు. పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా అనుసరించాల్సిన జాగ్రత్తలు, బాధ్యతలను వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఏ (ఎం), ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ప్రతి గ్రామంలో ముందస్తుగా విస్తృత ప్రచారం నిర్వహించి తల్లిదండ్రుల్లో అవగాహన పెంపొందించాలని, పల్స్ పోలియో కార్యక్రమాన్ని శాతం శాతం విజయవంతం చేయాలని డాక్టర్ నాగరాజు క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు.

# జూలైలో అమరావతి ఆస్పత్రి పనులు

**ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వెల్లడి**

**అమరావతి,జూన్25(జై భీమ్ న్యూస్) :**

హైదరాబాద్‌లో బసవతారకం ఆస్పత్రి ఇంకా విస్తరణ జరుగుతుందని ఆ హాస్పిటల్ చైర్మన్, హిందూపురం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యానించారు. అమరావతిలో కూడా బసవతారకం ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. బాలయ్య నటిస్తున్న112వ సినిమా అమరావతిలో గురువారం గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. ఈ మూవీ ప్రారంభోత్సవ వేడుకలకు మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్ ముఖ్య అతిథులుగా హాజరై.. క్లాప్ కొట్టి, కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. జులైలో ఆస్పత్రి పనులు ప్రారంభమవుతాయని వివరించారు. 2028లో మొదటి దశ పనులు పూర్తి అవుతాయని చెప్పుకొచ్చారు. బసవతారకం ఆస్పత్రి నిర్మాణం కోసం వర్కర్లు పగలు, రాత్రుళ్లు కూడా కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. వర్షాకాలం కావడంతో పనులు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రజలకు సేవచేయాలనే లక్ష్యంతోనే ఈ ఆస్పత్రి నిర్మిస్తున్నామని బాలకృష్ణ పేర్కొన్నారు.

# చలో మహబూబాబాద్

**మాదిగ మహాశక్తి ఆత్మీయ సమ్మేళనానికి భారీ ఏర్పాట్లు**




**హైద్రాబాద్, 25 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ఈ నెల 29న మహబూబాబాద్‌లో నిర్వహించనున్న మాదిగ మహాశక్తి (ఎంఎంఎస్) ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని సంస్థ నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యాప్తంగా మాదిగలు, మాదిగ శ్రేయోభిలాషులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సంస్థ నాయకత్వం పేర్కొన్న ప్రకారం, రాష్ట్ర రాజకీయాల్లో మాదిగల ఓటు కీలక శక్తిగా నిలిచిందని, ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ కూడా మాదిగల మద్దతు లేకుండా అధికారంలోకి రాలేదని పేర్కొన్నారు. మాదిగల సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగ మహాశక్తి జెండా కింద పనిచేస్తే కార్యకర్తలు నాయకులుగా ఎదిగే అవకాశం ఉంటుందని, మాదిగ సమాజానికి రాజకీయ భాగస్వామ్యం, అధికారంలో తగిన ప్రాతినిధ్యం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. తరతరాలుగా సమాజ అభివృద్ధికి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మాదిగలు చేసిన సేవలను గుర్తు చేస్తూ, వారి త్యాగాలకు తగిన గుర్తింపు, గౌరవం దక్కాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో ఇప్పటికే నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, సూర్యాపేట ప్రాంతాల్లో నిర్వహించిన మాదిగ ఆత్మగౌరవ, ఆత్మీయ సమ్మేళన సభలకు విశేష స్పందన లభించిందని, ఇప్పుడు మహబూబాబాద్ సభ ద్వారా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. మాదిగల రాజకీయ చైతన్యం, స్వయంపాలన, సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ హక్కుల సాధనే లక్ష్యంగా మాదిగ మహాశక్తి అధ్యక్షుడు మోత్కుపల్లి నర్సింహులు నాయకత్వంలో ఉద్యమం కొనసాగుతోందని పేర్కొన్నారు. మహబూబాబాద్‌లో జరిగే ఈ ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని మాదిగ మహాశక్తి నాయకులు విజ్ఞప్తి చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# మత్తు రహిత - టీబీ రహిత సమాజ నిర్మాణానికి సమిష్టి కృషి అవసరం: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**హన్మకొండ, 25 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను మరింత ప్రభావవంతంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. అలాగే టీబీ రహిత సమాజం లక్ష్యంగా టీబీ నియంత్రణ, నిర్మూలనకు పటిష్ట కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో టీబీ ముక్త్ భారత్, నషా ముక్త్ భారత్, సంకల్ప్ కార్యక్రమాల అమలుపై వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద చేపడుతున్న కార్యక్రమాలు, హైరిస్క్ వర్గాలపై నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలు, టీబీ బాధితులకు అందిస్తున్న చికిత్స, నిక్షయ్ పోషణ యోజన అమలు, దాతల సహకారంతో పంపిణీ చేస్తున్న పోషకాహార కిట్లు, 100 రోజుల ప్రత్యేక టీబీ నిర్మూలన ప్రచార కార్యక్రమాల పురోగతిని అధికారుల ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు శాఖ, ఈగల్ బృందం, రెడ్‌క్రాస్ సొసైటీ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో నషా ముక్త్ భారత్, టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణ కోసం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మాదకద్రవ్యాల బారినపడిన వారికి పునరావాస కేంద్రాల ద్వారా అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు సమిష్టిగా పనిచేయాలని పేర్కొన్నారు.



జిల్లాలో టీబీ అధికంగా నమోదవుతున్న 25 హైరిస్క్ గ్రామాలను గుర్తించినట్లు వెల్లడించిన కలెక్టర్, ఆయా ప్రాంతాల్లో మరింత విస్తృతంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. టీబీ నిర్ధారణ అయిన ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించి పూర్తిస్థాయిలో కోలుకునేలా చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సంకల్ప్ కార్యక్రమం కింద నవజాత శిశు మరణాలను మరింత తగ్గించి సింగిల్ డిజిట్ స్థాయికి తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ప్రతి వెయ్యి సజీవ జననాలకు సగటున 13.8 నవజాత శిశు మరణాలు నమోదవుతుండగా, హనుమకొండ జిల్లాలో 9,683 జననాలకు కేవలం 30 మరణాలు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో గృహ సందర్శనల సమయంలో తల్లులు, నవజాత శిశువులను తప్పనిసరిగా పరిశీలించి శిశు సంరక్షణ, పోషకాహారం, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమిష్టి కృషితోనే మత్తు రహిత, టీబీ రహిత, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.డి. రామ్‌కుమార్, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, డీఏఈఓ గోపాల్, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ టి. మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రజిత, డాక్టర్ మురళి, డాక్టర్ రుబీనా, డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగానికి ముందే ఓటు మ్యాపింగ్ తప్పనిసరి

**ఓటర్లు తమ వివరాలను సరిచూసుకోవాలి : కాజీపేట్ ఎమ్మార్వో సిహెచ్ రాజు**

**కాజీపేట, 25 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటు సరైన పోలింగ్ కేంద్రానికి మ్యాపింగ్ అయిందో లేదో నిర్ధారించుకోవాలని కాజీపేట్ ఎమ్మార్వో సిహెచ్ రాజు సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో సిహెచ్ రాజు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఓటర్లు ఎదుర్కొనే ప్రధాన సమస్యల్లో ఓటు మ్యాపింగ్ లోపాలు, పోలింగ్ కేంద్రాల మార్పులు, ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం, చిరునామా వివరాల్లో పొరపాట్లు ముఖ్యమైనవని పేర్కొన్నారు. ఇలాంటి సమస్యలను ముందుగానే గుర్తించి సరిదిద్దుకోవడం ద్వారా ఎన్నికల రోజున ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవచ్చన్నారు. ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచిన ఓటర్ హెల్ప్‌లైన్ యాప్, అధికారిక వెబ్‌సైట్ మరియు సంబంధిత సేవల ద్వారా ఓటర్లు తమ పేరు, పోలింగ్ కేంద్రం, భాగ సంఖ్య (పార్ట్ నంబర్), వార్డు వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నివాసం మారిన వారు తప్పనిసరిగా తమ ఓటును కొత్త నివాస ప్రాంతానికి మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. అలాగే 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో పేరు లేకపోవడం, తప్పులు ఉండటం లేదా ఇతర సవరణలు అవసరమైతే సంబంధిత బూత్ లెవల్ అధికారులను (బీఎల్ఓలు), తహసీల్దార్ కార్యాలయాన్ని లేదా ఎన్నికల శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని పేర్కొన్న ఆయన, ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్య బలోపేతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, బూత్ లెవల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గతాన్ని మరచి పోండి.. అలాంటి పొరపాట్లు జరగవు

**ఇకముందు మిమ్ములను బాగా చూసుకుంటా**

**వచ్చేది కెసిఆర్ ప్రభుత్వమే అంటూ..కార్యకర్తలకు కెటిఆర్ భరోసా**

**వికారాబాద్,జూన్25(జై భీమ్ న్యూస్):**

వచ్చే ఐదేళ్లు మన ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్యకర్తల బాగోగులు, ప్రజల సంక్షేమం రెండింటిని బ్యాలెన్స్‌గా నడిపించే బాధ్యత నాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. 2028లో మీ అందరి దయతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయితరు.. అయిన తర్వాత నేను బాధ్యత తీసుకుంటా..అన్నారు. మీకు రావాల్సిన పదవులు.. జరుగాల్సిన లాభం. మీకు కోరుకునే గౌరవం వచ్చే విధంగా చేసే బాధ్యత నాది. గతం మరిచిపోండి.. చిన్నచిన్నపొరపాట్లు జరిగి ఉండొచ్చు. ఇక్కడ ఉద్యమంలో పనిచేసిన బిడ్డలు కూడా ఉన్నారు. వాళ్లకు కూడా అయ్యో మాకు జరుగాల్సిన న్యాయం జరుగలేదనే భావన ఉండొచ్చు. నేను వారందని ప్రార్థిస్తున్నానని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో లాగా చిన్నచిన్న పొరపాట్లు జరుగకుండా చూసుకుంటమని నేను మీకు మాటిస్తున్నానన్నారు. వాస్తవానికి మొత్తం ప్రభుత్వం మీద దృష్టి పెట్టినం.. పార్టీ మీద ఎక్కువ దృష్టి పెట్టలేదు. కొత్త రాష్ట్రం, కొత్త సంసారం కాబట్టి పునాది గట్టిగా పడాలి అని.. మన రాష్ట్రం నవ్వే వాళ్ళ ముందు జారిపడొద్దని.. మీకు పరిపాలన చేతనైతదా అన్నోళ్లను నోళ్లు మూయించాలే.. మంచిగా నడిపించాలని ఆలోచన చేసాం తప్ప వేరే ఆలోచన చేయలేదని అన్నారు. ఒక సైనికుడు శాంతి సమయంలో ఎంత చెమట చిందిస్తే, యుద్ధంలో అంత తక్కువ రక్తం కారుతుంది. మీ ఈ టైంలో పార్టీని బందబస్తుగా నిర్మాణం చేసుకుంటే రేపు ఎన్నికలు వచ్చినంక ఆగమాగమయ్యే బాధ తప్పుతది.. మీకు ఐడీ కార్డు వస్తది.. ఆ ఐడీ కార్డు రేపు మన ప్రభుత్వం వచ్చినంక జేబులో పెట్టుకొని పోతే ఆ ఆఫీసర్ అయినా పోలీసోడు అయినా కేసీఆర్ మనిషి వచ్చిండు పని చేయాలని మీకు గౌరవమిచ్చి పనిచేసే పరిస్థితి ఉంటది. మంచి ఐడీ కార్డు తయారుచేసి ప్రతీ కార్యకర్తకు ఇస్తం. మిమ్మల్ని రాబోయే 5 సంవత్సరాలు మాత్రం గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరుగకుండా ఉద్యమ కారులను కానీ, కార్యకర్తలను కానీ కడుపులో పెట్టుకొని చూసుకునే బాధ్యత తీసుకుంటానన్నారు. ప్రభుత్వం లేదు.. పవర్ లేదు కానీ గర్వంగా ఎక్కడనిపిస్తుందంటే ఎమ్మెల్యే పోయినా.. ఎంపీ పోయినా.. అధికారం పోయినా ఇంతమంది సోదరులు ఇక్కడికొచ్చి మీరు చేస్తున్న ప్రకటన మామూలు ప్రకటన కాదు.. ఇది కాంగ్రెస్, బీజేపీ పార్టీ గుండెల్లో రైళ్లను ఉరికించే గొప్ప దృశ్యం ఇక్కడ కనిపిస్తుందని చేవెళ్ల సమావేశాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీ అందరికీ తెలుసు మనకు అధికారం పోయి రెండున్నరేళ్లయింది. ఎన్నికల ముందేమో నేను గుంపు మేస్త్రీని. రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి.. రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్ అని ఫోజులు కొట్టిండు. ఇవాళ రియల్ ఎస్టేట్‌ను ఏం చేసిండు మరి.. బొంద పెట్టిండు.. వంద ఫీట్ల అడుగులో పాతిపెట్టే పని చేసిండని మండిపడ్డారు. మన ప్రభుత్వం, పెద్దలు కేసీఆర్ ఉన్నప్పుడు షాబాద్‌లో చందన్ వెల్లిలోకానీ, సీతారాంపూర్‌లో కానీ ఎకరం 30 లక్షలుండేది. కానీ అక్కడ ఇండస్ట్రియల్ పారిశ్రామిక పార్క్ తీసుకొచ్చిన తర్వాత అక్కడ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీలు ఒక మైక్రోసాఫ్ట్, అమెజాన్ వెల్స్‌ఫన్ ఇతర కంపెనీలు తీసుకొచ్చిన తర్వాత నేడు ఎకరం 3 కోట్లకు తక్కువ షాబాద్‌లో లేని పరిస్థితి ఉంది. అదే రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత లక్షల మంది రియల్ ఎస్టేట్ మీద ఆధారపడి పనిచేసుకునే తమ్ముళ్లు, చె÷--లలెళ్లందరూ ఇవాళ దివాళా తీసే పరిస్థితి వచ్చిందన్నారు. వాస్తవేంటంటే ఎన్నికలకు ముందు ఎకరం కోటి రూపాయలు పలికింది కూడా ఇవాళ కనీసం రూ.50 లక్షలు, రూ.60 లక్షలకు కూడా కొనేందుకు ఎవరూ సిద్దంగా లేరన్నారు. దారుణమైన పరిస్థితి ఉంది. ఎందుకీ పరిస్థితి ఉందనేది మనం ఆలోచన చేసుకోవాల్సి ఉందని కేటీఆర్ గుర్తు చేశారు.

## గ్రామ పాలనలో ఉప సర్పంచుల పాత్రను నిర్వీర్యం చేయొద్దు

**హైదరాబాద్‌లో ఉప సర్పంచుల మహాధర్నా.. ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక**



**హైదరాబాద్, 25 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణలో ఉప సర్పంచుల హక్కుల పరిరక్షణ, గ్రామ పంచాయతీల్లో పెండింగ్ సమస్యల పరిష్కారం, చెక్ పవర్ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం, పెండింగ్ బిల్లుల విడుదల తదితర డిమాండ్లతో గురువారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఉప సర్పంచులు భారీ మహాధర్నా నిర్వహించారు. "హలో ఉప సర్పంచ్ -- చలో హైదరాబాద్" పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ఉప సర్పంచులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు. సర్పంచుల ఫోరం, ఉప సర్పంచుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహాధర్నాలో హుజురాబాద్ మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వన్నాల శివాజీ నాయకత్వంలో మండలంలోని 20 గ్రామాలకు చెందిన ఉప సర్పంచులు పాల్గొన్నారు. గ్రామీణాభివృద్ధిలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉప సర్పంచుల అధికారాలను క్రమంగా తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది స్థానిక సంస్థల స్వయంపాలన స్ఫూర్తికి విరుద్ధమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నాలో పాల్గొన్న ఉప సర్పంచులు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణ కోసం కల్పించిన చెక్ పవర్‌ను రద్దు చేయడం సరైన నిర్ణయం కాదన్నారు. ఈ అధికారాన్ని తొలగించడం ద్వారా గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధుల పాత్రను బలహీనపరచే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే చెక్ పవర్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకొని ఉప సర్పంచుల అధికారాలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో గ్రామాల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని తెలిపారు. నిధుల కొరత కారణంగా పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి పనులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేసి స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా హుజురాబాద్ మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వన్నాల శివాజీ మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఉప సర్పంచులకు తగిన గౌరవం, అధికారాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఉప సర్పంచుల పాత్రను గుర్తించి వారికి పరిపాలనా వ్యవస్థలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉప సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉప సర్పంచుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. భారీ సంఖ్యలో ఉప సర్పంచులు పాల్గొనడంతో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ నినాదాలతో మారుమోగింది. ఉప సర్పంచుల హక్కుల పరిరక్షణ, చెక్ పవర్ పునరుద్ధరణ, పెండింగ్ బిల్లుల విడుదల, గ్రామ పంచాయతీల బలోపేతం వంటి డిమాండ్లతో నిర్వహించిన ఈ మహాధర్నా విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు.

## బీసీ గురుకుల విద్యాసంస్థల బలోపేతం

**ఐఐఐటీలు, ఎన్ఐటీలలో విద్యార్థులకు ట్యాప్‌టాప్‌లు**

**విద్యార్థి మరణిస్తే కుటుంబానికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా**

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్,జూన్25(జై భీమ్ న్యూస్) :**

బీసీ గురుకుల విద్యాసంస్థల బలోపేతం, విద్యార్థుల సంక్షేమం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో గురుకుల విద్యాసంస్థలకు సంబంధించిన పలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాసంస్థల పేరును మార్చేందుకు ఆమోదం తెలిపారు. మహాత్మా జ్యోతిరావు గురుకుల పాఠశాలలు ఇక నుండి తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహాత్మా జ్యోతిరావు పూలే విద్యా సంస్థల సొసైటీగా మార్పు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఐఐఐటీలు, ఎన్ఐటీల వంటి జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించాలని నిర్ణయించారు. ఉన్నత విద్యలో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించడమే దీని ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఎంజేపీ వ్యవసాయ కళాశాలల్లో ఎంజేపీ విద్యార్థులకే ప్రవేశాలు కల్పించడంతో పాటు విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన పలు సంస్కరణలకు సమావేశం ఆమోదం తెలిపింది. విద్యార్థి మరణించిన సందర్భంలో కుటుంబానికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని నిర్ణయించారు. ప్రిన్సిపాల్ నియామకాలలో ప్రస్తుతం అమలులో ఉన్న 70 శాతం ప్రమోషన్లు, 30 శాతం ప్రత్యక్ష నియామకాల విధానాన్ని కొనసాగించాలని సమావేశం నిర్ణయించింది. అలాగే రిటైర్డ్ ప్రిన్సిపాళ్లను అకడమిక్ కన్సల్టెంట్లుగా వినియోగించే అంశంపై కమిటీ ఏర్పాటు చేయనున్నారు. పాఠశాలలు, కళాశాలల బడ్జెట్ పరిమితులకు ఆమోదం తెలిపిన సమావేశం, గురుకుల పాఠశాలలకు డెస్క్‌టాప్ కంప్యూటర్ల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జూనియర్ కళాశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ సరఫరాకు కూడా ఆమోదం లభించింది. రాష్ట్రంలో 12 సైనిక్ స్కూళ్ల ఏర్పాటుపై పూర్తి నివేదిక సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పోటీ పరీక్షల్లో మరిన్ని విజయాలు సాధించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకుల విద్యాసంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధి, పరిపాలనా బలోపేతానికి సంబంధించిన పలు కీలక అంశాలపై సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. మావేశంలో పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ప్రాంతీయ సమన్వయ కార్యాలయాల వివిధ విభాగాలకు బడ్జెట్ పరిమితులను బోర్డు ఆమోదించింది. వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి కేవలం ఎంజేపీ గురుకుల విద్యాసంస్థల విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. విద్యా పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పదవీ విరమణ చేసిన ప్రిన్సిపాళ్ల సేవలను అకడమిక్ కన్సల్టెంట్లుగా వినియోగించుకునే అంశంపై నియామక నిబంధనలను రూపొందించేందుకు కమిటీ ఏర్పాటు చేసి తదనుగుణంగా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. సందర్భంగా మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతూ, బీసీ విద్యార్థులకు అత్యుత్తమ విద్యా అవకాశాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాల పెంపు, పోటీ పరీక్షల్లో విజయాలు, జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో అధిక ప్రవేశాలు సాధించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయాలు సంస్థను మరింత బలోపేతం చేయనున్నాయని మంత్రి వెల్లడించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీమతి బాలమయాదేవి, ఎంజేపీ బీసీ గురుకులాల కార్యదర్శి శ్రీ సైదులు, వివిధ విభాగాల అధికారులు,బోర్డు సభ్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి





**అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

**మాదకద్రవ్యాల నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలి**

**యువత మెరుగైన లక్ష్యాల కోసం పాటుపడాలి**

**కేయూ ఈసి మెంబర్ అనిత రెడ్డి**

**హనుమకొండ, జూన్ 25:**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పాల్గొన్నారు. హనుమకొండ ఆదాలత్ సర్కిల్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, ముఖ్యంగా యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఫ్లాష్‌మాబ్‌లు, అవగాహన నాటికలు ప్రజలను ఆకట్టుకున్నాయి. మత్తు పదార్థాల వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు, సామాజిక అభివృద్ధిపై చూపే ప్రతికూల ప్రభావాలను కళారూపాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం సమాజానికి పెను సవాలుగా మారుతోందని పేర్కొన్నారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తేనే మత్తు పదార్థాల నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానం, క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యక్రమాల వైపు యువతను ప్రోత్సహించడం ద్వారా వ్యసనాలకు దూరంగా ఉంచవచ్చని తెలిపారు. మత్తు రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు, విద్యార్థులు, యువతతో కలిసి లి"మత్తు పదార్థాలను ఉపయోగించము, ఇతరులను కూడా వాటి నుంచి దూరంగా ఉండేలా చైతన్యం కల్పిస్తాము"లి అనే ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో పాల్గొన్న వారు "డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితానికి యెస్ చెప్పండి" "మత్తుకు దూరం -- ఆరోగ్యానికి చేరువ" "మాదకద్రవ్యాలకు స్వస్తి పలుకుదాం -- ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం"లివంటి నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, హనుమకొండ ఎసిపి నరసింహా రావు, డిప్యూటీ సివిల్ సర్జన్ ఎన్సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ ఈగల్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రవీందర్,బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ అవంతి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, జిల్లా బాలల పరిరక్షణ ఇంచార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్ చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ ఎస్ భాస్కర్,మహిళా శక్తి కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ కళ్యాణి, సఖి అడ్మిన్ హైమావతి , అశోక్ రెడ్డి హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ రాము, ఎఫ్ ఆర్ ఓ రవి కృష్ణ విద్యా శాఖ సీఎంవో సుమ, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ , ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, విద్యా, వైద్యారోగ్య శాఖ, పోలీస్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తుంగభద్రానదికి 33 కొత్తగేట్లు

**రూ.51 కోట్లతో 33 కొత్త గేట్ల ఏర్పాటు**

**మూడు రాష్ట్రాల సిఎంలు కలసి ప్రారంభం**

**కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి పాటిల్**

**ఒకేవేదికపై డికె, చంద్రబాబు, రేవంత్**

**బళ్లారి,జూన్25(జై భీమ్ న్యూస్):**

కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ. 51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. రూ. 51కోట్లతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన 33 కొత్త స్పీల్ వే గేట్లను ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, శివకుమార్ కలసి ప్రారంభిండం విశేషం. ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఆయా రాష్ట్రాల మంత్రులు, అధికారులు, పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం విజయనగర జిల్లా హోసపేటలో జరిగే భారీ బహిరంగ సభకు కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రులు వెళ్లారు. అంతకుముందు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లోని ఆడిటోరియంలో భేటీ అయ్యారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ భేటీ అవ్వగా.. సమావేశానికి రేవంత్ రెడ్డి 15 నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. అనంతరం ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నీటి సమస్యలపై కీలక చర్చలు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి గేట్ల ప్రారంభోత్సవానికి వెళ్లారు.

## ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు

**వాటిని పరిరక్షిస్తేనే భవిష్యత్**

**గంగా, గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలి**

**నెలల్లో 33 గేట్ల పునరుద్ధరించాం: సీఎం చంద్రబాబు**



**బళ్లారి,జూన్25(జై భీమ్ న్యూస్) :**

దేశంలో నదుల అనుసంధానం తన కలల ప్రాజెక్టు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. గంగా, గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలని పేర్కొన్నారు.రాయలసీమలోని పలు ప్రాంతాలకు సాగునీరు.. మరికొన్ని ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్న ప్రాజెక్టు తుంగభద్ర అని వ్యాఖ్యానించారు. తుంగభద్ర డ్యామ్ 70 ఏళ్ల చరిత్ర ఉన్న ప్రాజెక్టు అని తెలిపారు. తుంగభద్ర తల్లికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా.. అందరూ రైతులకూ నమస్కారాలు అంటూ సీఎం చంద్రబాబు కన్నడలో ప్రసంగించారు. ప్రాజెక్టు నిర్వహణ బాగుంటేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతోందని చెప్పారు. 6 నెలల్లో తుంగభద్ర ప్రాజెక్టు 33 గేట్ల పునరుద్ధరించామని వివరించారు. తమిళనాడుకు నీళ్లు ఇవ్వాలని 1983లో నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొచ్చారు. నీటి సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఇవాళ ముగ్గురు సీఎంలు కలవడం చరిత్రాత్మకమని చెప్పుకొచ్చారు. ఎల్‌నినో వల్ల కొన్ని ప్రాంతాల్లో కరవు సమస్య ఉందని తెలిపారు. నీరు ఉంటేనే చరిత్ర, నాగరికత అని.. ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని చంద్రబాబు అభివర్ణించారు. వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని అన్నారు. ప్రాజెక్టులు బాగుంటేనే భవిష్యత్తు తరాలకు భరోసా ఉంటుందని చెప్పారు. తుంగభద్ర.. మూడు రాష్ట్రాల్లో లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తోంది. ఆరు నెలల్లో 33 గేట్లు అమర్చిన అందరినీ అభినందిస్తున్నా. కేంద్ర జలవనరులశాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ముగ్గురు సీఎంలు కలవడం ఓ చరిత్ర. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు తుంగభద్ర తాగు, సాగు నీరు ఇచ్చింది. ఈ నది లేకపోతే చాలా సమస్యలు వచ్చేవి. జలవనరుల సంరక్షణ, సమర్థ నీటి నిర్వహణ మనందరి బాధ్యత. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశంలో నదుల అనుసంధానం చేయాల్సిన బాధ్యత ఉంది. గంగ, కావేరి నదులను అనుసంధానం చేస్తే భారత్ అన్‌స్టాపబుల్‌గా దూసుకెళ్తుంది. సీఆర్ పాటిల్‌కు నదులు అనుసంధానం చేసిన అనుభవం ఉంది. జాతీయ ప్రాజెక్టుగా గోదావరి-కావేరిని కేంద్రం అనుసంధానం చేయాలని చంద్రబాబు అన్నారు. ఇకపోతే కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో చరిత్రాత్మక తీర్మానం చేశామని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. మూడు రాష్ట్రాల రైతుల కోసం తీసుకున్న నిర్ణయం ఓ చరిత్ర అని తెలిపారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, తాను చరిత్ర సృష్టిస్తామని చెప్పారు. అందరం కలిసి సమన్వయంతో పనిచేస్తామని అన్నారు. మూడు రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తామని సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు.

## ఎపిలో క్రియేటివ్ ఎకానమీ విప్లవం

**జూలై నెలలో మెగా ఫిల్మ్ వర్క్‌షాప్**

**యువతకు ఆధునిక సినీ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ**

**సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**

అమరావతి,జూన్25(జై భీమ్ న్యూస్):నవ్యాంధ్రలో సరికొత్త 'క్రియేటివ్ ఎకానమీ విప్లవం'కు శ్రీకారం చుట్టనున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రాష్ట్రంలోని స్థానిక యువత ప్రతిభను ప్రోత్సాహించడంతో పాటు.. యువతకు ఆధునిక సినీ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జూలై నెలలో మెగా ఫిల్మ్ వర్క్‌షాప్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. గురువారం సచివాలయంలో మంత్రిని జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు కలిసి పలు అంశాలపై చర్చించారు. సినీ పరిశ్రమకు సంబంధించిన 24 క్రాఫ్ట్స్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఏఐ ఆధారిత ఫిల్మ్ మేకింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 24 క్రాఫ్ట్స్ శిక్షణకు సంబంధించి జాడెక్స్ సంస్థ రూపొందించిన యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి ఫిల్మ్ మేకింగ్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. సినీ, మీడియా రంగాల్లో కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

## సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

**హైదరాబాద్,జూన్25(జై భీమ్ న్యూస్):**

సర్‌పై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నేతలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. సర్ క్రియను కాంగ్రెస్ క్యాడర్ అధిగమించాలని ఎంపీ తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నేతలు అంతా ఈప్రక్రియను పరిశీలించాలన్నారు. రెండు చోట్ల ఓటు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. నెల రోజుల పాటు బీఎల్‌వోలు బూత్‌ను విడిచి వెళ్లొద్దని ఆదేశించారు. ప్రతి పది బూత్‌లకు ఒక సూపర్‌వైజర్‌ను, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక సూపర్‌వైజర్‌ను పెడుతున్నామన్నారు. బీఎల్‌వోలతో నాయకులు నిరంతరం టచ్‌లో ఉండి.. సర్ జరిగే విధానాన్ని పరిశీలించాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 36 వేలకు పైగా పోలింగ్ బూత్‌లలో ఎస్ఐఆర్ పక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటికే అన్ని పోలింగ్ బూత్‌లలో బీఎల్ఏలను నియమించామని తెలిపారు. ఎస్.ఐ.ఆర్‌ను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. బిహార్‌లో 76 లక్షల ఓట్లు, పశ్చిమ బెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారని.. ఆ రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. కేరళలో కాంగ్రెస్ కార్యకర్తలు ముందుగానే అలర్ట్ కావడంతో కాపాడుకోగలిగామని ఎంపీ వెల్లడించారు. ఇప్పుడు తెలంగాణలోనూ అదే జరగబోతోందన్నారు. నెల రోజుల పాటు జరిగే సర్ పక్రియలో బీఎల్‌వోలు మూడు సార్లు ఇంటికి వచ్చే ప్రయత్నం చేస్తారన్నారు. తెలంగాణలో ఇప్పటికే 1 కోటి 2 లక్షల ఓట్లను అన్‌మ్యాప్ చేశారని.. అంటే దాదాపు 33 శాతం ఓట్లు అన్‌మ్యాప్ అయ్యాయని తెలిపారు. బీఎల్‌వోలు అప్రమత్తంగా లేకపోతే కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓట్లు కూడా తొలగిపోయే అవకాశం ఉందన్నారు. 2002 ఓటర్ లిస్ట్, 2025 ఓటర్ లిస్ట్, అన్‌మ్యాప్ ఓటర్ లిస్ట్‌ను దగ్గర పెట్టుకుని పరిశీలించాలని సూచించారు.

## ఎక్సైజ్ శాఖలో డిప్యూటీ కమిషనర్ల బదిలీ

హైదరాబాద్,జూన్25(జై భీమ్ న్యూస్): రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎక్సైజ్ శాఖలో డిప్యూటీ కమిషనర్లుగా పనిచేస్తున్న అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. మరికొందరికి కొత్తగా పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న జె హరికిషన్‌ను సైబరాబాద్ డీసీగా, నల్గొండలో డీసీగా పనిచేస్తున్న ఏ శ్రీనివాస్‌రెడ్డిని గ్రేటర్ హైదరాబాద్ డీసీగా బదిలీ చేశారు. రంగారెడ్డి డీసీగా ఉన్న దశరథను టీజీబీసీఎల్ డీసీగా, ఖమ్మంలో డీసీగా ఉన్న జనార్దన్ రెడ్డి ఆదిలాబాద్ డీసీగా బదిలీ చేశారు. టీజీబీసీఎల్ ఆర్‌ఆర్-1లో ఉన్న దాతురాజు గౌడ్‌ను వరంగల్ డీసీగా, నిజామాబాద్‌లో ఏసీగా ఉన్న వి.సోమిరెడ్డిని ఖమ్మం డీసీగా, కరీంనగర్ బీసీఎల్‌లో మేనేజర్‌గా ఉన్న రవీకుమార్‌ను కరీంనగర్ డీసీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీ లేబుల్స్‌లో పనిచేస్తున్న పి శ్రీధర్‌ను నిజామాబాద్ డీసీగా, హెడ్‌క్వార్టర్స్‌లో డీసీగా ఉన్న కె రఘురాంను రంగారెడ్డి డీసీగా, హైదరాబాద్ ఏసీగా ఉన్న ఏ అనిల్ కుమార్ రెడ్డిని ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. స్పెషల్ టాస్క్ ఫోర్స్‌లో ఏసీగా ఉన్న పి ప్రణవిని మల్కాజిగిరి డీసీగా, మహబూబ్ నగర్ ఏసీ విజయ్ భాస్కర్ రెడ్డి డీసీ అక్కడే పదోన్నతి కల్పించింది. బ్రేవరీస్‌లో ఏసీగా ఉన్న చంద్రయ్యను మెదక్ డీసీగా, ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న సీవీ శశిధర్ రెడ్డిని నల్గొండ డీసీగా బదిలీ చేసింది. బదిలీ అయిన అధికారులు తక్షణమే విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది

## అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పోషకాహారం

**బాలామృతంను ప్రారంభించిన ఎంపి కేశినేని చిన్ని**

**విజయవాడ,జూన్25(జై భీమ్ న్యూస్):**

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పోషకాహారాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో 'బాలామృతం'ని విజయవాడలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల పురోగతిపై సమీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వీబీ జీరాంజీ మాదిరిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత పథకాలనే కొత్త పేర్లతో అమలు చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. సమీక్ష సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ సమస్యలపైనా విస్తృతంగా చర్చించినట్లు ఎంపీ చిన్ని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించిన సమస్యలపై త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని ఎంపీ చిన్ని చెప్పారు. సమస్యల పరిష్కారంలో జిల్లా ఏపీలోనే ముందంజలో ఉందని ఆయన తెలిపారు. అయితే వివిధ శాఖల మధ్య సమన్వయం కొంతమేర లోపించడం వల్ల కొన్ని అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రైల్వే నెట్‌వర్క్‌కు సంబంధించిన సమస్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, వాటి పరిష్కారంపై దృష్టి సారించినట్లు తెలిపారు. శాటిలైట్ రైల్వేస్టేషన్లతో పాటు కొండపల్లి ప్రాంతానికి కూడా త్వరలో బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. విజయవాడ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బుడమేరు గండి సమస్యపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎంపీ తెలిపారు. త్వరలోనే బుడమేరు సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలకు భిన్నంగా, బుడమేరు నిర్వాసితులకు తగిన పునరావాస సదుపాయాలు కల్పిస్తూ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు.

## 28న నల్లగొండ పర్యటనకు సిఎం రేవంత్

**హైదరాబాద్,జూన్25(జై భీమ్ న్యూస్) :**

ఈనెల 28న నల్లగొండకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారు. 13వేల కోట్ల వ్యయంతో నిర్మించే హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సిఎం పర్యటన సందర్భంగా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి. హైదరాబాద్ నుండి హెలికాప్టర్ లో బయలుదేరి నల్లగొండ జిల్లా కనగల్ మండలం చేరుకొని...మొదటగా... కనగల్ మండలం మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన 'హ్యామ్' రోడ్ల పైలాన్ ను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. అనంతరం...నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో మొదటి ఫేజ్ డ్రింకింగ్ వాటర్ అందించే పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఎన్జీ కాలేజి గ్రౌండ్స్ లో జరిగే భారీ బహిరంగ సభకు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం...అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు అందజేయనున్నట్లు వెల్లడించారు.

# సినిమాలకు మళ్లీ బ్రేక్... ప్రెగ్నెన్సీపై క్లారిటీ ఇచ్చిన సమంత



తల్లి కాబోతున్నట్లు తెలిపిన నటి సమంత

సినిమాలకు తాత్కాలికంగా విరామం తీసుకుంటున్నట్లు వెల్లడి

'మా ఇంటి బంగారం' సక్సెస్ మీట్‌లో ప్రెగ్నెన్సీ వార్తల ధృవీకరణ

డిసెంబరులో తొలి బిడ్డకు జన్మనివ్వనున్నట్లు సమాచారం

గతేడాది డిసెంబర్‌లో ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరుతో సమంత వివాహం

స్టార్ హీరోయిన్ సమంత తాను తల్లి కాబోతున్నట్లు స్పష్టత ఇచ్చారు. ఈ నేపథ్యంలో సినిమాలకు తాత్కాలికంగా విరామం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' సక్సెస్ మీట్‌లో బుధవారం ఆమె ఈ శుభవార్తను అభిమానులతో పంచుకున్నారు. కొద్ది వారాలుగా ఆమె గర్భవతి అంటూ వస్తున్న ఊహాగానాలకు ఈ ప్రకటనతో తెరపడింది.'మా ఇంటి బంగారం' చిత్ర విజయోత్సవ వేడుకలో సమంత మాట్లాడుతూ, ఈ పరిణామం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాను కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండనున్నట్లు తెలిపారు. ఈ సినిమాకు దర్శకత్వం వహించిన బి.వి. నందినీ రెడ్డి కూడా ఈ వార్తను ధృవీకరించారు. సినిమా ఘన విజయం సాధించిన తరుణంలో ఈ శుభవార్త రావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. సమంత నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం, విడుదలైన 5 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా ?50 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం.కొన్ని రోజులుగా 'మా ఇంటి బంగారం' సక్సెస్ వేడుకల వీడియోలలో సమంత బేబీ బంప్‌తో కనిపించడంతో ఆమె గర్భవతి అనే ప్రచారం మొదలైంది. ఆమె ప్రస్తుతం తొలిదశ గర్భంతో ఉన్నారని, డిసెంబర్ 2026లో బిడ్డకు జన్మనివ్వనున్నారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. 39 ఏళ్ల సమంత, ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరును 2025 డిసెంబరులో వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆరోగ్య సమస్యల తర్వాత కొంత విరామం తీసుకున్న ఆమె, 'మా ఇంటి బంగారం'తో విజయవంతంగా పునరాగమనం చేశారు. ఈ సమయంలోనే ఆమె వ్యక్తిగత జీవితంలోనూ ఈ శుభవార్త చోటుచేసుకోవడంతో అభిమానులు, చిత్ర పరిశ్రమ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## చేతులు వేయడం, చనువు తీసుకోవడం ఇండస్ట్రీలో ప్రతి స్టేజ్‌లోనూ ఉంది: సింగర్ సునీత

ప్రముఖ టాలీవుడ్ సింగర్ సునీత సినిమా పరిశ్రమలోని చీకటి కోణాలపై, ముఖ్యంగా మహిళల సేఫ్టీపై అత్యంత భయంకరమైన నిజాలను బయటపెట్టారు. ఇటీవల హేమ కమిటీ రిపోర్ట్, ఆ తర్వాత ఇండస్ట్రీలో మహిళల రక్షణపై డిబేట్స్ నడుస్తున్న తరుణంలో... సునీత తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన బోల్డ్ కామెంట్స్ ఇప్పుడు ఫిల్మ్ సర్కిల్స్‌ను షేక్ చేస్తున్నాయి. సినిమా ఇండస్ట్రీ కొత్తగా వచ్చే అమ్మాయిలకు ఎంతవరకు సేఫ్? అనే ప్రశ్నపై ఆమె స్పష్టంగా మాట్లాడారు. ఇండస్ట్రీలో కొనసాగడం అంత ఈజీ కాదని సునీత అన్నారు. "ఒక అమ్మాయి ఇండస్ట్రీకి రావాలంటే ఆమెకు కచ్చితంగా నాలుగు శక్తులు ఉండాలి. అవి.. ఎమోషనల్ (మానసిక స్థైర్యం), ఫిజికల్, మెంటల్, ఫైనాన్షియల్ స్ట్రెంత్స్. ఈ నాలుగూ లేకపోతే ఇండస్ట్రీ ఇక్కడ ప్రతి క్షణం నరకం చూపిస్తుంది. కఠినమైన పరీక్ష పెడుతుంది. ఇండస్ట్రీ అసలు సేఫ్ కాదు" అని స్పష్టం చేశారు. ఇండస్ట్రీలో అథారిటీ, పవర్ చేతుల్లో పెట్టుకున్న కొందరు వ్యక్తులు... అవతలి వారి బలహీనతలను ఎలా క్యాష్ చేసుకుంటారో సునీత దాపరికం లేకుండా వెల్లడించారు. "ఇక్కడ పవర్ ఉన్నవాళ్లు అవతలి వారిని వేధించాలని లేదా వాడుకోవాలని చూస్తారు. కేవలం కొత్తగా ఛాన్సుల కోసం వచ్చే వాళ్లనే కాదు... ఇండస్ట్రీలో ఆల్రెడీ మంచి పేరు, క్రేజ్ తెచ్చుకున్న వాళ్లను కూడా వదలరు. చేతులు వేయడం, అనవసరమైన చనువు తీసుకోవడం వంటివి ప్రతి స్టేజ్‌లో ఉంటాయి" అని తెలిపారు. "ఒక మగాడు ఏ ఉద్దేశంతో మాట్లాడుతున్నాడో... ఆ మాటల్లోనే లేదా అతడు తాకిన ఒకే ఒక్క టచ్‌లోనే ఆడపిల్లలకి వెంటనే తెలిసిపోతుంది. చాలా మంది వేరే దారి లేక, సినిమా అవకాశాల కోసం అవన్నీ భరిస్తూ లోపల ఏడుస్తారు. కానీ, నాలాంటి వాళ్లు మాత్రం ఆ పనులు చేయకుండా, అలాంటి వాతావరణం నచ్చక ఇండస్ట్రీ నుండి బయటకు వచ్చేస్తారు" అని సునీత చెప్పారు.





# ఈ సినిమా హాలీవుడ్ హద్దులను చెరిపేసింది: ప్రియాంక చోప్రా

వరల్డ్ స్టార్ ప్రియాంక చోప్రా, చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టాలనుకునే కొత్త టాలెంట్‌కు ఇప్పుడు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఒక మంచి ఆలోచన ఉంటే చాలు, తక్కువ బడ్జెట్‌తోనూ ప్రపంచవ్యాప్తంగా విజయం సాధించవచ్చని, ఇటీవల విడుదలై సంచలనం సృష్టించిన హారర్ సినిమా 'అబ్సెషన్' దీనికి చక్కటి ఉదాహరణ అని ఆమె పేర్కొన్నారు. బుధవారం కేన్స్ లయన్స్ సదస్సులో పాల్గొన్న ప్రియాంక, మారుతున్న సినిమా ప్రపంచంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'అబ్సెషన్' వంటి సినిమాలతో హాలీవుడ్ హద్దులు చెరిగిపోతున్నాయని అభిప్రాయపడ్డారు."మీ దగ్గర ఒక ఐడియా ఉంటే, దాన్ని షూట్ చేసి యూట్యూబ్‌లో పెట్టండి. అది 'అబ్సెషన్' లాంటి పెద్ద హిట్ సినిమా కూడా కావచ్చు. వినోద రంగంలో ఉండటానికి ఇది సరైన సమయం, ఎందుకంటే ఇప్పుడు మీ ఆలోచనలే మీ ఆస్తి" అని ప్రియాంక తెలిపారు. ఒకప్పుడు పరిస్థితి ఇలా ఉండేది కాదని ఆమె గుర్తుచేసుకున్నారు.గత పదేళ్లుగా హాలీవుడ్‌లో కెరీర్ నిర్మించుకుంటున్న ప్రియాంక, తాను పరిశ్రమలోకి అడుగుపెట్టినప్పుడు ఎదుర్కొన్న సవాళ్లను పంచుకున్నారు. "మా తల్లిదండ్రులు డాక్టర్లు. మాకు ఇండస్ట్రీలో ఎవరూ తెలియదు, ఎలా ముందుకు వెళ్లాలో కూడా అవగాహన లేదు. అప్పట్లో సినిమా అనేది కొందరికే పరిమితమైన రంగం" అని అన్నారు.తన కెరీర్ తొలినాళ్లలో భారతీయ సినిమాలు ఎప్పటికీ హాలీవుడ్ అంతటి ప్రపంచ స్థాయికి చేరలేవని చాలామంది అనేవారని ఆమె గుర్తుచేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే కొత్త ఫిల్మ్ మేకర్స్‌ను, మంచి ఐడియాలు ఉండి అవకాశాలు రాని వారిని ప్రోత్సహించేందుకు తాను నిర్మాణ సంస్థను ప్రారంభించినట్టు వెల్లడించారు. హిందీలో ఎందరో గొప్ప దర్శకులు, నటులతో పనిచేశానని, కానీ హాలీవుడ్‌లో ఆ స్థాయిలో ఇంకా విభిన్నమైన పాత్రలు చేయలేదని, ఆ దిశగా ప్రయత్నిస్తున్నానని ప్రియాంక తెలిపారు. స్ట్రీమింగ్ సర్వీసులు, కరోనా మహమ్మారి కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు అన్ని భాషల కంటెంట్‌ను చూడటం మొదలుపెట్టారని ఆమె అభిప్రాయపడ్డారు.